

# సొంతింటి కలపై సెంట్రింగ్ సిండికేట్ పంజా

**మేడ్చల్, జులై 14 ప్రభాతవార్త:** సొంత గూడు కట్టుకోవాలనే సామాన్యుడి కలపై సెంట్రింగ్ సిండికేట్ గుదిబండలా మారింది. జీవితకాల కష్టార్జితాన్ని ధారపోసి, నయా పైసా కూడబెట్టి ఇల్లు నిర్మించుకుందామనుకుంటున్న మధ్యతరగతి గుండెల్లో సెంట్రింగ్ కాంట్రాక్టర్ల అడ్డగోలు దోపిడీ గుబులు రేపుతోంది. ఒకప్పుడు చదరపు అడుగుకు రూ. 25 నుంచి రూ. 35 మధ్య పలికిన సెంట్రింగ్ చార్జీలను, ఏకపక్షంగా రాత్రికి రాత్రే దాదాపు రెట్టింపు చేసి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు. "మా అసోసియేషన్ నిర్ణయించిన రేటే ఇది.. నచ్చితే చేయించుకోండి, లేదంటే లేదు" అనే నిర్లక్ష్యపు సమాధానాలతో ఇటు యజమానులను, అటు భవన నిర్మాణదారులను తీవ్ర ఇబ్బందులకు

**రెట్టింపైన రేట్లతో మధ్యతరగతి గుండెల్లో గుబులు..**
**అత్యవసర సమయాల్లో అడ్డగోలు వసూళ్లు..**
**పట్టించుకోని అధికార యంత్రాంగం!**

గురిచేస్తున్నారు.

బ్యాంకు రుణాల తదుపరి విడతలు విడుదల కావాలన్నా, లేదా వర్షాకాలం ముంచుకొచ్చే లోపు పనులు వేగంగా పూర్తి కావాలన్నా.. గృహ యజమానుల అత్యవసర పరిస్థితిని ఈ సిండికేట్ తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. ఇలాంటి విపత్కర సమయాల్లో ఇష్టారాజ్యంగా రేట్లు పెంచేసి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దయనీయ స్థితిలో ఇందిరమ్మ లబ్ధిదారులు

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. సర్కారు ఇచ్చే అరకొర ఆర్థిక సహాయంతో ఎంతోకొంత అప్పుచేసి ఇల్లు పూర్తి చేసుకుందామనుకుంటున్న పేదలకు, ఈ అదనపు సెంట్రింగ్ చార్జీలు మోయలేని భారంగా మారాయి.

నిమ్మకు నీరెత్తినట్లు అధికార యంత్రాంగం

మార్కెట్‌లో ఇంత బహిరంగంగా దోపిడీ జరుగుతున్నా, కార్మిక శాఖ గానీ, జిల్లా యంత్రాంగం గానీ కనీసం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, తనిఖీలు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

బలవంతంగా ఒకే రేటును రుద్దుతూ మార్కెట్ పోటీని దెబ్బతీస్తే జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. రేట్ల విషయంలో బెదిరింపులకు పాల్పడినా, పనులను బలవంతంగా అడ్డుకున్నా తక్షణమే స్థానిక పోలీసులను ఆశ్రయించవచ్చని చెబుతున్నారు. కాంట్రాక్టర్లంతా గ్రూపుగా ఏర్పడి సిండికేట్ దందా నడుపుతున్న వైనంపై ఆధారాలతో ఫిర్యాదు చేయటానికి బాధితులు సన్నాహమవుతున్నారు. ఈ అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయకపోతే మేడ్చల్‌లో సామాన్యుడు ఇల్లు కట్టుకోవడం అసాధ్యంగా మారుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఈ వ్యవహారంపై తక్షణ విచారణకు ఆదేశించి సామాన్యుడికి న్యాయం చేయాలని మేడ్చల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త







**రంగారెడ్డి జిల్లాలో నెమ్మదించిన ఖరీఫ్ సాగు..**
**ఎండిపోతున్న రైతుల ఆశలు**
**వరుణుడు ముఖం చాటేయడంతో అయోమయం**
**భూములు దున్ని, విత్తనాలు సిద్ధం చేసుకున్నా తప్పని నిరీక్షణ**



# చుక్క నీరు లేక.. దిక్కు తోచక!

**(యాచారం/రంగారెడ్డిఅర్బన్ ప్రభాతవార్త)** ఆకాశం వైపు దీనంగా..నైరుతి రుతుపవనాలు ఆశించిన మేరకు చురుగ్గా లేకపోవడంతో రంగారెడ్డి జిల్లాలో ఖరీఫ్ సాగు తీవ్రంగా నెమ్మదించింది. ఇప్పటికే భూములను దున్ని, విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకున్న రైతులు మంచి వర్షాల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో 5,06,257 ఎకరాల్లో పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ, వర్షాలు ఆలస్యం కావడంతో సాగు పనులు వెనుకబడ్డాయి. జిల్లాలో అక్కడక్కడా చిరుజల్లులు కురిసినప్పటికీ వ్యవసాయానికి అవసరమైన స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. పొలాల్లో తగినంత తేమ లేకపోవడంతో, ముందుగా విత్తనాలు వేస్తే మొలక శాతం తగ్గుతుందనే భయంతో రైతులు ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

**కరువు కోరల్లో యాచారం**

శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ ప్రభావం తీవ్రంగా మారిందని, రెండు నెలలు గడుస్తున్నా సరైన వర్షాలు లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కాలువలు, నదులు లేని ఇబ్రహీంపట్నం, యాచారం మండలాల్లో తీవ్ర కరువు నెలకొనే పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యాచారం వ్యవసాయ అధికారి రవినాథ్ స్పందిస్తూ.. నీటి వనరులను దృష్టిలో పెట్టుకొని రైతులు మెట్ట పంటలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సకాలంలో వర్షాలు కురవాలని, సమృద్ధిగా పంటలు పండాలని కాంక్షిస్తూ యాచారం మండల పరిధిలోని మల్కిజ్‌గూడ గ్రామంలో సర్పంచ్ దేరంగుల శంకర్, చేనమోని రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులంతా కలిసి 'వరద పాశం' కార్యక్రమాన్ని కూడా నిర్వహించుకున్నారు.

**పడిపోయిన సాగు అంచనాలు**

అధికారుల సూచనల మేరకు రైతులు వరి తదితర అధిక నీటిని ఉపయోగించే పంటల సాగును భారీగా తగ్గిస్తున్నారు. యాచారం మండలంలో గత సంవత్సరంతో పోలిస్తే సాగు అంచనాలు దారుణంగా పడిపోయాయి వరి పైర్లు గత ఏడాది 11,800 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది కేవలం 600 ఎకరాలకే పరిమితం కానుంది. పత్తి.. గత ఏడాది 17,500 ఎకరాల నుండి ఈ ఏడాది 13,000 ఎకరాలకు తగ్గింది. జొన్న సాగు 760 ఎకరాలు, కంది సాగు 650 ఎకరాలు సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**రైతుకు దెబ్బ మీద దెబ్బ**

వర్షాభావానికి తోడు రైతులకు పెట్టుబడి కష్టాలు మరింత భారంగా మారాయి. ఎరువులు, ట్రాక్టర్ దున్నకాల ఖర్చులు, కూలీల రేట్లు పెరగడంతో రైతులు తీవ్ర నష్టాల్లో >>2



వరుణుడి కరుణ కోసం పూజలు చేస్తున్న మల్కిజ్‌గూడ గ్రామస్తులు



నీరు లేక యాచారం మండలంలో నెర్రలిస్తున్న వ్యవసాయ భూములు

# మేడ్చల్‌లో గంజాయి బ్యాచ్

**★ఒడిశా నుంచి సరఫరా.. ★విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు ★పరారీలో సూత్రధారి**

**మేడ్చల్, జులై 14. ప్రభాతవార్త :** మేడ్చల్‌లో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన ముఠా గుట్టురట్టైంది. ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని రహస్యంగా తరలించి స్థానికంగా విక్రయిస్తున్న ఓ యువకుడిని మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి సుమారు రూ.1 లక్ష విలువైన రెండు కిలోల గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారి పరారీలో ఉండగా, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన అలోక్ సర్కార్ (20) కొంతకాలంగా మేడ్చల్ పట్టణ సమీపంలోని కిష్టాపూర్‌లో నివాసం ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగంతో వచ్చే ఆదాయం సరిపోవడం లేదనే కారణంతో అక్రమ మార్గంలో సులభంగా డబ్బు సంపాదించాలని భావించిన అతడు గంజాయి వ్యాపారంలోకి అడుగుపెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఒడిశాలో నివసిస్తున్న తన స్నేహితుడు సోహైల్ సహకారంతో అక్కడి నుంచి గంజాయిని రహస్యంగా మేడ్చల్‌కు తరలించి, ఇక్కడ చిన్న చిన్న ప్యాకెట్లుగా విభజించి స్థానికంగా విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. విశ్వసనీయ సమాచారంతో నిఘా పెట్టిన మేడ్చల్ పోలీసులు దాడులు నిర్వహించి అలోక్ సర్కార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా గంజాయి సరఫరా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల ప్రాథమిక విచారణలో గంజాయి సరఫరా వెనుక అసలు సూత్రధారి సోహైల్ పరారీలో ఉండగా, అతన్ని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**కళాశాలల పరిసరాలలో విక్రయాల జోరు**

మేడ్చల్ ప్రాంతంలో ఇటీవల మత్తు పదార్థాల అక్రమ రవాణాపై పోలీసుల నిఘా మరింత పెరిగింది. ముఖ్యంగా మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో అనేక ఇంజినీరింగ్, డిగ్రీ, ఫార్మసీ మరియు ఇతర ఉన్నత విద్యా సంస్థలు ఉండటంతో యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు మత్తు పదార్థాల ముఠాలు తమ వ్యాపారాన్ని విస్తరించే ప్రయత్నం చేస్తున్నాయనే అనుమానాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులు, అనుమానాస్పద స్నేహాలు, అధిక ఖర్చులు వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. అలాగే కళాశాల యాజమాన్యాలు కూడా విద్యార్థుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మత్తు పదార్థాల ప్రమాదాలపై చైతన్యం కల్పించాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మత్తు పదార్థాలపై కఠిన చర్యలుమేడ్చల్ పోలీసులు మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేస్తున్నారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరుతున్నారు. ప్రజల సహకారంతో మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు

# అప్పు తిప్పలు!

**బ్యాంకుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు**

**మేనజర్ దురుసుగా వ్యవహరిస్తున్నారని నిరసన**

**కుల్కచర్ల, జులై 14 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు, ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు. బ్యాంకుకు వచ్చే తమపై మేనేజర్ కసురుకుంటూ, దురుసుగా ప్రవర్తిస్తున్నారని వారు ఆరోపించారు. ముఖ్యంగా గోల్డ్ లోన్ (బంగారు రుణాలు) తదితర సమస్యలపై బ్యాంకుకు వచ్చే రైతులు, ఖాతాదారులు, మహిళలు, వృద్ధులకు సరైన సేవలు అందించకుండా రోజుల తరబడి చుట్టూ తిప్పించుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. >>2



# ఓఆర్ఆర్‌పై కారు బోల్తా!

**డెంటల్ విద్యార్థిని మృతి**

**స్నేహితుడికి తీవ్ర గాయాలు**

**శంషాబాద్, జులై 14, ప్రభాతవార్త :** ఔటర్ రింగ్ రోడ్‌పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందగా, ఆమెతో ప్రయాణిస్తున్న స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం...సికింద్రాబాద్‌కు చెందిన అడ్డంకి మధుసూదన్ కుమార్తె డెంటల్ విద్యార్థిని అమూల్య (21), ఎంఎన్ఆర్ కళా శాలలో చదువుతోంది. మంగళవారం అమూల్య తన స్నేహితుడు సిద్ధార్‌తో కలిసి తెల్లవారు జామున సుమారు 1:30 గంటలకు టిఎస్09 ఈఎక్స్ 4976 నంబరు గల కారులో ఇంటి నుంచి బయలుదేరి శంషాబాద్ ప్రాంతానికి వెళ్లా రు. అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా మార్గం తప్పి పెద్ద అంబర్‌పేట్ వైపు వెళ్లే మార్గం లోకి చేరుకున్నారు. >>2



# అన్నదాతలను ఆదుకోండి

**-రైతు సంఘం డిమాండ్**

**వికారాబాద్, ప్రభాతవార్త:** మెట్ట పంట పొలాలకు ఎకరాకు 8 వేయిలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశ్య పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశ్య పద్మ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయిందని అన్నారు. వరికి ప్రత్యమ్నాయంగా మెట్ట పంటలను సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా ఎకరాకు రూ.8 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశించినంతగా వానలు పడడం లేదని ఈ సంవత్సరం సేద్యం ఎలా ఉంటుందని భయాందోళనతో రైతులు విత్తనాలు నాటారన్నారు. దాదాపు >>2

# కన్నీటిలోనూ కరుణ

**✦మరణంలోనూ జీవిస్తూ ఉండాలని నిర్ణయం ✦ఐదుగురికి ప్రాణదాతగా నిలిచిన నారాయణరెడ్డి! ✦మనవరాలి పుట్టినరోజే ముగింపుగా మారిన వేళ... ✦రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ ✦శోకసంద్రంలోనూ సాహసోపేత నిర్ణయం ✦తండ్రి ఆఖరి కోరికను నెరవేర్చిన కుమారులు ✦అవయవదానం చేసి మానవత్వాన్ని చాటిన కుటుంబ సభ్యులు ✦గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు, కళ్లు యశోదా ఆసుపత్రికి అప్పగింత ✦అశ్రునయనాల మధ్య వీడ్కోలు**

**మోమిన్‌పేట్, జులై 14 ప్రభాతవార్త:** ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ కాగా, అతని కుటుంబ సభ్యులు గుండె నిబ్బరం చేసుకుని అవయవ దానం చేసిన మానవతా సంఘటన మోమిన్‌పేట్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మోమిన్‌పేట్ మండల పరిధిలోని టేకులపల్లి గ్రామానికి చెందిన భేలూరు నారాయణ రెడ్డి (56) తండ్రి కమాల్ రెడ్డి, ఈనెల 10వ తేదీ శుక్రవారం నాడు మండల పరిధిలోని అమ్రాదిఖుర్దు గ్రామంలో జరిగిన తన మనవరాలి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడానికి వెళ్లారు. మనవరాలి జన్మదిన వేడుకలు పూర్తి చేసుకుని తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న మరొక ద్విచక్ర వాహనం ఆయన బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారా యణ రెడ్డి తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే స్పృహ కోల్పో యారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరా బాద్ సోమాజీగూడలోని యశోదా ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఫలితం దక్కలేదు. మూడు రోజుల >>2



అవయవదానం అనంతరం నారాయణరెడ్డి మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి విషాదవదనంతో తీసుకెళుతున్న కుటుంబ సభ్యులు(ఇన్‌సెట్) నారాయణరెడ్డి (ఫైల్)



ఎంపితో సమస్యలు చెప్పకుంటున్న రైతులు

# మా భూముల జోలికి రాకండి

**బులెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు**

**ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి వద్ద రైతుల ఆవేదన**

**శంషాబాద్, జులై 14, ప్రభాతవార్త :** బులెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులు గురిచేస్తూ భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని బహదూర్ గూడ రైతులు ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డితో మొర పెట్టుకున్నారు. తగిన పరిష్కారం చూపాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేయడంతో ఆయన స్పందించారు. తోకల శ్రీనివాస్ రెడ్డి పూర్తి వివరాలు తెలుసుకుని, గ్రామస్తులకు అండగా నిలిచారు. మంగళవారం గ్రామరైతులు, మండల నాయకులతో కలిసి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కార్యాలయానికి వెళ్లి సమస్యపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల అభిప్రాయాలు, సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని, వారికి ఎలాంటి నష్టం జరగకుండా సమస్యకు న్యాయమైన పరిష్కారం చూపించే దిశగా సంబంధిత అధికారులతో చర్చిస్తామని ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. అలాగే వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి, గ్రామస్తుల హక్కులను కాపాడేందుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండలానికి చెందిన ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు, బాధిత కుటుంబ సభ్యులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పీఠం కోసం పోటాపోటీ

**◗ధారూర్ పిఎసిఎస్ అధ్యక్ష పదవిపైనే అందరి దృష్టి**
**◗స్పీకర్ ప్రసాద్ కుమార్ వద్దకు క్యూ కట్టిన ఆశావహులు**
**◗సీనియారిటీకే ప్రాధాన్యం ఇవ్వాలంటున్న రైతులు**



**ధారూర్, జులై 14 ప్రభాతవార్త:** ధారూర్ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్ష పదవిపై ప్రస్తుతం స్థానిక రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. సహకార వ్యవస్థలోనే అత్యంత కీలకమైన ఈ పదవిని నామినేట్ పద్ధతి ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో, ఆశావహులంతా రేసులోకి దూసుకొచ్చారు. ఈ నేపథ్యంలో, ఎవరికి వారు తమ వంతు ప్రయత్నాలను ముమ్మురం చేశారు. తమకే అవకాశం కల్పించాలంటూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వద్ద ఆశావహులు జోరుగా రాయబారాలు నడుపుతున్నారు.

**స్పీకర్ నిర్ణయంపై ఉత్కంఠ**

ఈ ప్రతిష్టాత్మక పదవిని దక్కించుకోవడానికి యువ నాయకుల నుంచి మొదలుకొని అనుభవజ్ఞులైన సీనియర్ల వరకు పలువురు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పార్టీకి తాము చేసిన సేవలను, నియోజకవర్గంలో తమకున్న పట్టును వివరిస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మద్దతు కూడగట్టే పనిలో పడ్డారు. దీంతో స్పీకర్ ఎవరి వైపు మొగ్గు చూపుతారు, ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారనేది ఇప్పుడు మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే, ఈ పదవి భర్తీ విషయమై మండల ప్రజలు, రైతుల అభిప్రాయం మాత్రం >>2



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

## ఎక్కువ నీరు అవసరం లేని పంటలను సాగుచేసుకోవాలి

**పెద్దేముల్, జులై 14, ప్రభాతవార్త:** ఎల్‌నీనో ప్రభావం కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున అధిక నీటి అవసరం ఉండే వరి, మొక్కజొన్న, చెరుకు వంటి పంటల సాగును తగ్గించి, వాటి స్థానంలో తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే సిరిధాన్యాలు, జొన్న, కందులు వంటి పంటలను సాగుచేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్ ప్రీతమ్ సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధ్వర్యంలో మంగళవారం పెద్దేముల్ మండలం మంబాపూర్ రైతువేదికలో ఎల్ నీనో ప్రభావం దానికి అనుగుణంగా వ్యవసాయశాఖ రూపొందించిన కంటింజెన్సి ప్రణాళికపై రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ పవన్ ప్రీతమ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సిపార్సు చేసిన ఏడు సన్న వరి వంగడాలను మాత్రమే సాగుచేయాలని, అవి ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, బిపిటి 5204, జై శ్రీరామ్, హెచ్ఎంటి సోనా, జేజిఎల్ 1798, డబ్లుజిఎల్ 44 రైతులు విత్తన డీలర్ల వద్ద కొనుగోలు చేసిన విత్తనాలను తప్పనిసరిగా సంబంధిత విత్తన దుకాణంలో సీడ్ సేల్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు అపర్ణ, తేజస్విని, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**కేశంపేట, జులై 14 ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామ పంచాయతీకి నాను తండాకు చెందిన జర్పుల లక్షి ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న లేమామిడి గ్రామ మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం మృతురాలి కుటుంబ సభ్యు లకు రూ.3 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ గొప్ప మనసుతో మా కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించిన శ్రీశైలం గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుదాఘాతానికి యువకుడు మృతి

**కందుకూరు, జులై 14, ప్రభాతవార్త:** విద్యుత్ ఘాతానికి తానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బంజరుగడ్డ తండాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మంగళవారం ఉదయం జరిగిన ఈ సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బంజరుగడ్డ తండాకు చెందిన మేఘావత్ హనుమంత్ కుమారుడు మేఘత్ చరణ్ (17) మిత్రులతో కలిసి గ్రామంలో క్రికెట్ ఆడుతుండగా బంతి ఎగిరి సమీపంలోని రమేష్ ఇంటిపైన పడింది బంతిని తేవడానికి మేఘావత్ చరణ్ బంతి పడిన రమేష్ ఇంటిపైకి వెళ్లి బంతిని తెచ్చే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు ఇంటి పైనుండి వెళ్లిన 11 కెవి విద్యుత్ వైరు చరణ్ కు తాకడంతో అక్కడికక్కడే చరణ్ మృతి చెందాడు. ఈ విషయాన్ని గుర్తించిన తోటి బాలురు సమాచారాన్ని గ్రామస్తులకు తెలప డంతో బాధిత కుటుంబం అక్కడికి చేరుకుని విగత జీవుడైన చరణ్ చూసి కుటుంబ సభ్యులు కన్నీరు కురిపించారు. ఈ సమాచారాన్ని పోలీసులకు అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మేఘావత్ హనుమంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. బాధితుని ఫిర్యాదులో 11 కెవి విద్యుత్ వైర్ల కింద రమేష్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం జరిగిందని ఆ సమయంలో విద్యుత్ వైర్ల కింద ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంలోనూ ఇంటి నిర్మాణాన్ని ఆపడంలోనూ నిర్లక్ష ్యం వహించిన ఇంటి యజమానితో పాటు విద్యుత్ శాఖ, గ్రామ పంచాయతీ అధికార యంత్రాంగం నిర్లక్ష ్యం వల్ల ఈరోజు చేతి కందిన యువకుడు మృతి చెందాడని ప్రమాదానికి వారి నిర్లక్ష ్యమే కారణమని వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని బాధ్యత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ఫిర్యాదు చేసినట్లు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విషయమై ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ లైన్లో సమీపంలో గృహనిర్మాణాలు చేపట్టకూడదని అలాగే పిల్లలు విద్యుత్ లైన్‌లకు సమీపంలోని భవనాలపైకి ఎక్కి అజాగ్రత్తగా ఈ విషయంలో వారి తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అదేవిధంగా విద్యుత్‌లైన్లకు అతి సమీపంలో ఇంటి నిర్మాణాలు జరిగే సమయం లో విద్యుత్ శాఖ, మరియు పంచాయతీ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకొని అనుమతులు ఇవ్వరాదని నిబంధనలకు వ్యతిరేకంగా ఇంటి నిర్మా ణాలు జరిగితే సంబంధిత యజమానుల పైన ఆయా శాఖల అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటి నిర్మాణాలు చేసుకునేవారు ముందస్తు ఆలోచనతో ఇంటి నిర్మాణాలు చేసుకుంటే సమస్యలు రావని సిఐ హెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఘటనలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లు రమేష్, ఎస్సై మహేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉర్దూను అధికార బాషగా గుర్తించినా నిర్లక్ష్యమేనా!

**కొడంగల్, జులై 14, ప్రభాతవార్త:** ఉర్దూను రెండవ అధికార భాషగా గుర్తించినా..దీని ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు,పాఠశాలల్లో ఉర్దూలో బోర్డులపై పేర్లు రాయించకపోవడం సరైందికాదని ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు ఎస్బీ.గుల్షన్ అన్నారు. ఆయన స్దానిక జడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించగా బోర్డుపై ఉర్దూలో పేరు లేకపోవడం పట్ల క్షేత్రస్దాయిలో అధికారులు ఉర్దూ పట్ల వివక్ష చేయిస్తున్నారని ఆరోపించారు.రెండు రోజుల్లో పాఠశాల బోర్డుపై ఉర్దూలో రాయిస్తామని ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు.లేని పక్షంలో పాఠశాల ముందు ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వ హిస్తామని అన్నారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు సర్తాజ్ హుస్సేన్, తాజుద్దిన్,షేక్ అమ్మద్,ఖాలీద్,నజీర్,అక్తార్ తదితరులు ఉన్నారు.

## సుస్థిర వ్యర్థాల నిర్వహణ హబ్‌గా జవహర్‌నగర్

### సమగ్ర కార్యాచరణకు జయేష్ రంజన్ ఆదేశం

**జవహర్‌నగర్,జులై14,ప్రభాతవార్త:** జవహర్ నగర్‌ను సుస్థిర ఘన వ్యర్థాల నిర్వహణలో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఆదేశించారు. మంగళవారం జవహర్‌నగర్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆయన వేస్టు ఎనర్జీ ప్లాంట్, ల్యాండ్‌ఫిల్ ప్రాంతంతో పాటు వైఎస్ఆర్ నగర్, గబ్బిలాలపేట కాలనీలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.వేస్టుఎనర్జీ ప్లాంట్‌లో వ్యర్థాల సేకరణ నుంచి విద్యుత్ ఉత్పత్తి వరకు అమలవుతున్న ప్రక్రియలను పరిశీలించిన జయేష్ రంజన్, ప్లాంట్ నిర్వహణ సామర్థ్యం, పర్యావరణ పరిరక్షణ చర్యలు, కాలుష్య నియంత్రణ ప్రమాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యర్థాలను శాస్త్రీయంగా వినియోగించి శక్తిగా మార్చే విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం వైఎస్ఆర్ నగర్, గబ్బిలాలపేట ప్రాంతాల్లో స్థానిక ప్రజలతో మాట్లాడి తాగునీరు, రహదారులు, పారిశుద్ధం, డ్రైనేజీ, ఆరోగ్య సేవలు, విద్య, ఉపాధి అవకాశాలకు సంబంధించిన సమస్యలను తెలుసుకున్నారు. జవహర్‌నగర్ అభివృద్ధి కేవలం వ్యర్థాల నిర్వహణకే పరిమితం కాకుండా, స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ల్యాండ్‌ఫిల్ ప్రాంతంలో ఐఐటీ బాంబే నిపుణులు ప్రతిపాదించిన శాస్త్రీయ ల్యాండ్‌ఫిల్ రిమిడియేషన్, పాత వ్యర్థాల శుద్ధి, లీచేట్ నియంత్రణ, మీథేన్ వాయువు నిర్వహణ, దుర్వాసన నివారణ, భూభాగ పునరుద్ధరణ వంటి అంశాలపై సాంకేతిక ప్రజెంటేషన్ నిర్వహించారు. బయోగ్యాస్ ఉత్పత్తి, సేంద్రియ వ్యర్థాల నుంచి విద్యుత్, ఇంధనం, సేంద్రీయ ఎరువుల తయారీ, వ్యర్థాల పునర్వినియోగంపై కూడా విస్తృతంగా చర్చించారు.

## డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలి

**కేశంపేట జులై 14 ప్రభాతవార్త :** సామాన్య ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అని బిజెపి సీనియర్ నాయకుడు తలసాని పవన్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం కేశంపేటలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కొత్తూరు సమీపంలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కాకపోగా, రాజకీయ పార్టీల మధ్య పరస్పర దూషణలకు వేదికగా మారిందన్నారు. ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటూ అధికార, ప్రతిపక్షాలు (కాంగ్రెస్, బీఆర్ఎస్) ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. ప్రజల ఆరోగ్యం కంటే తమ రాజకీయ పబ్బం గడుపుకోవడమే పరమావధిగా ఈ రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు.

# సర్‌లో తప్పులు రానీయకండి

**చౌడాపూర్, జులై 14 ప్రభాతవార్త :** ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ ను వేగవంతం చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అధికారులకు ఆదేశాలిచ్చారు. మంగళవారం వికారాబాద్ జిల్లా లోని, చౌడాపూర్ మండలంలో కలెక్టర్ దీపక్ తివారి సుడిగాలి పర్యటన చేశారు.చౌడపూర్ మండల తహసిల్దార్ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునే విధంగా బిఎల్ఓ లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు.. ఎన్యుమరేషన్ ఫారాలలో తప్పులు లేకుండా జాగ్రత్తలు వహించాలని, ప్రతీ ఓటరు ఫారాలను తిరిగి తీసుకుని, ఖచ్చితంగా డిజిటలైజేషన్ చేసే విధంగా బి.ఎల్.ఓ.లు భాద్యత వహించాలని కలెక్టర్ తెలిపారు. వందశాతం ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలిచ్చారు..మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని, మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారికి సూచించారు.

**ప్రభుత్వ పాఠశాల తనిఖీ**

మందిపల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి,ఉపాధ్యాయుల విద్యాబోధనను పరిశీలించారు.. కొత్తపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యాభోదనను పరిశీలించారు.. విద్యార్థుల పడక గదులను, టాయిలెట్లు, మధ్యాహ్న భోజన వంటకాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్, భోజన నాణ్యతను మరింత



బిఎల్ఓల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ దీపక్ తివారి

పెంచాలని సూచించారు.. నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం, మరికల్ గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగును పరిశీలించారు.ఆయిల్ ఫామ్ సాగు చేస్తే అధిక లాభాలు ఉంటాయని, ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు.ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, సబ్సిడి సద్వినియోగం ఛేసుకునేలా రైతులకు వివరించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.. అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జెడ్పి సీఈఓ సుదీర్, డిఎంహెచ్ఓ సుధాకర్ లాల్,మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు , ఎంపిడిఓ సోమలింగం, మండల విద్యాధికారి రాంచందర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వైభవంగా సుందర విజయం- శాస్త్రోక్తంగా గోపూజలు

**శంషాబాద్ జులై 14, ప్రభాతవార్త :** ముచ్చింతల్లోని పవిత్ర జీవా ప్రాంగణంలో గల దివ్యసాకేత క్షేత్రం భక్తిభావంతో పులకించిపోయింది. లోకకల్యాణార్థం, భక్తజనుల శ్రేయస్సును కాంక్షి స్తూ త్రిదండి చిన్నజీయర్ స్వామి దివ్య మంగళాశాసనములతో సాగుతున్న సుందర విజయం అనే ఆధ్యాత్మిక మహోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. సమాజ శ్రేయస్సును ఆకాంక్షి స్తూ నిరంతరాయంగా నిర్వహిస్తున్న 108 అమావాస్యల సంపూర్ణ సుందరకాండ పారాయణ మహాయజ్ఞంలో భాగంగా వేద పండితులు శాస్త్రోక్తంగా, మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పవిత్ర పర్వదినాన అంజనీపుత్రుడైన ఆ ఆంజనేయస్వామికి తేనెతో మధురమైన అభిషేకం గావించి, భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. మరోవైపు అమావాస్య పుణ్యదినాన్ని పురస్కరించుకుని ఆశ్రమంలోని గోశాలలో కొలువై ఉన్న గోమాతలకు విశేష అర్చనలు చేసి, వాటికి అత్యంత ప్రీతికరమైన గ్రాసాన్ని (ఆహారాన్ని) సమర్పించారు. ఈ పరమ పవిత్రమైన గోసేవ మహోత్సవంలో మై హోమ్ గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వరరావు దంపతసమేతంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో గోపూజలు నిర్వహించారు. చిన్నజీయర్ స్వామి వారికి దివ్య మంగళాశాసనాలు అందించారు. హరినామ స్మరణతో మార్మోగిన ఈ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, భక్తి సాగరంలో ఓలలాడుతూ తరించిపోయారు.

## నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

**కొడంగల్, జులై 14, ప్రభాతవార్త :** జల్ సంచయ్ జన భాగిదారి కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్దానిక జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్దులకు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్బంగా విద్యార్దులకు ప్రతి నీటి బొట్టు విలువ,వర్షపు నీటి సంరక్షణ,భూగర్బ జలాల పెంపు,నీటిని పొదుపుగా వినియోగించే విదానాలపై అవగామన కల్పించారు. విద్యార్థులు తమ ఇళ్ళలో, సమాజంలో నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్బంగా మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్ మాట్లాడుతూ జల సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత,భవిష్యత్ తరాలకు తగిన నీటి వనరులు అందించేందుకు ప్రతి ఒక్కరూ జల్ సంచయ్ జన భాగిదారి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాద్యాయులు, విద్యార్దులు పాల్గొన్నారు.

## వర్షపు నీటిని పొదుపుగా వాడాలి

**శంకర్‌పల్లి, జులై 14, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి పురపాలక సంఘంలో మంగళవారం అమృత్ 3.0 కార్యక్రమంలో భాగంగా క్యాచ్ ది రెయిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షపు నీటిని పొదుపు చేయుటకు అవసరమైన జాగ్రత్తలు తీసుకొనుటకు ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా హోర్డింగ్స్ ఏర్పాటు చేసి తెలంగాణా మోడల్ స్కూల్ యందు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్ అమర్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ సాత ప్రవీణ్ కుమార్, మరియు కౌన్సిల్ సభ్యులు, మునిసిపల్ కమీషనర్ ఏ.యోగేష్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బి.ఆనంద్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నదాతలను ఆదుకోండి

(మొదటి పేజీ తరువాయి)

30 శాతం విత్తనాలు మొలకత్తలేదని, నకిలీ విత్తనాల బెడద వల్ల కొన్ని జిల్లాలలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు ఆందోళన వ్యక్తం చేశారు. మెట్ట పంటలకు అవసరమయ్యే విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచ డానికి చర్యలు తీసుకోవాలన్నారు. వరి పండిన పొలాలకు మెట్ట పంటలకు మళ్లించాలంటే అవసరమైన భూసారాన్ని పెంచడానికి అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని, మంచి దిగుబడి ఉండదని, పంటలకు మద్దతు ధరలు అమలవుతాయా లేదా అన్న సందేహంలో రైతులు ఆందోళన పడుతు న్నారన్నారని అన్నారు. రైతులు ధైర్యంగా భవిష్యత్తులో కూడా పంటల మార్పిడి విధానాన్ని అమలు చేయడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అనుకూల చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటియుసి నాయకులు విజయలక్షి ్మ పండిత్, మాజీ విద్యార్థి నాయకుడు పీర్ ముహమ్మద్, నాయకులు అనంతయ్య, విమలమ్మ, సావిత్రమ్మ, పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**శంకర్‌పల్లి, జులై 14, ప్రభాతవార్త :** విద్యార్థులు యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ పద్మ అన్నారు. మంగళవారం ఈగల్ టీంతో కలిసి పొద్దుటూరు స్కూల్లో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమశిక్షణను అలవర్చుకోవాలని ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని ఉత్తమ మార్కులు సాధించేందుకు కష్టపడాలన్నారు. అనంతరంసైబర్ క్రైమ్, డ్రగ్స్ వ్యతిరేకత, మహిళలు, పిల్లల భద్రత, రోడ్డు భద్రత మరియు ఫోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తేజ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బాధితుడు అబ్దుల్ మోయిజ్‌తో మాట్లాడుతున్న ఎంపీడీవో నర్సింలు, పంచాయతీ కార్యదర్శి కల్పన

## ఎట్టకేలకు రికార్డుల్లోనూ బతికించారు!

### నిలిచిన పెన్షన్ పునరుద్ధరణ- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపిడిఒ

**ధారూర్,జులై 14, ప్రభాతవార్త:** నిలిచిన పెన్షన్ పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం ప్రభాతవార్తలో బతికుండగానే రికార్డుల్లో మరణం..! అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఎంపిడిఒ నరసింహులు స్పందించారు. పెన్షన్ నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్న అబ్దుల్ మోయిజ్ అనే వృద్ధుడి సమస్యను పరిగణనలోకి తీసుకున్న ఎంపిడిఒ, స్వయంగా ఆయన స్వగ్రామానికి వెళ్లారు. అక్కడ బాధితుడిని స్వయంగా పరిశీలించి, ఆయన సజీవంగానే ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. రికార్డుల్లో జరిగిన ఈ పొరపాటును సరిదిద్ది, బాధితుడికి త్వరలోనే తిరిగి పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటానని ఎంపిడిఒ హామీ ఇచ్చారు. ఆయనతోపాటు పంచాయతీ కార్యదర్శి కల్పన ఉన్నారు.

## కన్నీటిలోనూ కరుణ

(మొదటి పేజీ తరువాయి)

పాటు మృత్యువుతో పోరాడిన నారాయణ రెడ్డి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. చివరికి ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో, తీవ్ర శోకసంద్రంలో ఉన్నప్పటికీ నారాయణ రెడ్డి కుమారులు మాధవరెడ్డి, సిద్ధార్థరెడ్డిలు ఒక గొప్ప నిర్ణయాన్ని తీసుకున్నారు. తమ తండ్రి గతంలో వ్యక్తపరిచిన కోరిక మేరకు, ఆయన శరీరం నుండి గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, కళ్లను సేకరించి అవసరమైన వారికి ఉచితంగా ఇవ్వాల్సిందిగా ఆసుపత్రి వైద్యులకు అప్పగించారు. సాటి మనిషికి చిన్న సహాయం చేయడానికి కూడా వెనుకాడుతున్న ఈ రోజుల్లో, ఇంతటి కఠినమైన పరిస్థితిలోనూ అవయవదానం చేయడానికి ముందుకు రావడం చాలా గొప్ప విషయమని, ఇలాంటి వ్యక్తులు సమాజంలో చాలా అరుదుగా ఉంటారని ఆసుపత్రి వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు కొనియాడారు. సామాజిక మాధ్యమాల్లోనూ నారాయణ రెడ్డి కుటుంబంపై ప్రశంసల జల్లు కురిసింది. నారాయణ రెడ్డి చేసిన ఈ త్యాగం చిరస్మరణీయమని పేర్కొంటూ, అతని సతీమణి, కుమారుల ఔదార్యానికి కృతజ్ఞతగా ఆసుపత్రి సిబ్బంది పార్థివ దేహాన్ని అధికారిక లాంఛనాలతో కుటుంబ సభ్యులకు అప్పగించి స్వగ్రామమైన టేకులపల్లికి తరలించారు. తమ తండ్రి కోరికను నెరవేర్చి ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపిన నారాయణ రెడ్డి మృతితో టేకులపల్లి గ్రామం మొత్తం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. సోమవారం సాయంత్రం స్వగ్రామంలో నారాయణ రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు స్థానిక సర్పంచ్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి, పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఆయనకు కన్నీటి నివాళులర్పించారు.

## సీజనల్ వ్యాధులు ప్రభలకుండా చర్యలు

### ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,జులై 14, ప్రభాతవార్త :** వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రభలకుండా వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్ ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో జిల్లా స్థాయిలో వైద్యాధికారులతో వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను వైద్యాధికారులు సమర్దవంతంగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్నందున సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఫివర్ సర్వేలు నిర్వహించటం, అనుమానిత కేసులను వెంటనే గుర్తించి చికిత్సలు అందించటం, దోమల నివారణ చర్యలు చేపట్టటానికి ప్రజల్లోనూ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత కాల వ్యవధిలో పూర్తి చేసి రాష్ట్ర స్థాయిలోనే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాను ఆదర్శంగా నిలపాలని వైద్యాధికారులకు డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ సూచించారు. ఈ సమావేశంలో కీసర, మల్కాజ్‌గిరి డివిజన్ల ఉప వైద్య,ఆరోగ్య అధికారులు డాక్టర్ గీత, డాక్టర్ లావణ్యరెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ గీత, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కౌశిక్, జిల్లాలోని అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, సంబంధిత రిపోర్టింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చులతో యూనిఫాం, షూలు పంపిణీ

**షాద్‌నగర్, జులై 14, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ఉపాధ్యాయులు ముందుకు వస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని ఫారూఖ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఉర్దూ మాధ్యమం) ఉపాధ్యాయులు మరోసారి నిరూ పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. విజయలక్షి ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు తెల్లని యూనిఫాంలు, షూలు, బెల్టులు, టైలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మండల విద్యాశాఖ అధికారి మనోహర్, పీఆర్‌టీయూ టీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, వార్డు కౌన్సిలర్ కర్ణాటక మురళీమోహన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. యూటీఏ రాష్ట్ర అధ్యక్షులు పాఠశాల అభివృద్ధి కోసం రూ.20 వేల విరాళాన్ని అందజేశారు. అలాగే గోవర్ధన్ యాదవ్ మాట్లాడుతూ పాఠశాలలోని ప్రతి తరగతి గదిలో తన సొంత ఖర్చుతో ఫ్యాన్లు ఏర్పాటు చేయిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూటీఏ రాష్ట్ర నాయకులు ఖాజా కుతుబుద్దీన్, షకీల్ అహ్మద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, యూటీఏ ఉపాధ్యక్షుడు అన్సారీ అహ్మద్ బజాహర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహమ్మద్ మాక్సూద్ ఖాన్, సీనియర్ పాత్రికేయుడు మన్సూర్ ఖాన్, ఏఏపీసీ చైర్‌పర్సన్ కుర్షీద్ బేగం, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ మహమ్మద్ బవజీర్, ఆర్‌యూపీపీటీఎస్ఆర్ఆర్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ దార్ల రాఘవేంద్రాచారి, ఉపాధ్యాయులు నీరజ, మల్లికార్జున్, షాజహాన్ బేగం, అబిదా బేగం, మజర్ ఉన్నీసా బేగం, గౌసియా బేగం, రేష్మ బేగం, నసీం బేగం, సంగీత, మంజుల, షమీమ్ పాల్గొన్నారు.

## మేడిపల్లిలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

**యాచారం,జులై 14, ప్రభాతవార్త:** విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని అధికారులు నిర్లక్ష ్యంగా ఉన్నారని మేడిపల్లి మాజీ సర్పంచ్ బోడ కృష్ణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం బోడ కృష్ణ విలేకరులతో మాట్లాడుతూ.. యాచారం మండల పరిధి లోని నకర్త మేడిపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 294 లో వ్యవసాయ భూమిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మనుషులకు తగిలేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ తిరిగిన ప్రాణం పోయేదాకా చూస్తున్నారని పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యుత్తు తీగల మరమ్మతులు చేసి ప్రాణాలు కాపాడాలని లేదంటే చూస్తుండగానే ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది అన్నారు.

## చుక్క నీరు లేక..దిక్కు తోచక!

(మొదటి పేజీ తరువాయి)

కూరుకుపోతున్నారు. దీనికి తోడు ఎరువులను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేయాల్సి రావడం, పెరిగిన ధరలు వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఒకవైపు పెట్టుబడులు పెరిగి, మరోవైపు వర్షాల్లేక మూలికే నక్క పైన తాటికాయ పడ్డట్టు రైతాంగం తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో రెండు మూడు రోజుల్లో విస్తృతంగా వర్షాలు కురిస్తేనే ఖరీఫ్ సాగు ఊపందుకుంటుందని, లేకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, వర్షాభావ ప్రాంతాలను గుర్తించి కరువు చర్యలు చేపట్టాలని, రైతులకు కరువు భత్యం అందించి ఆదుకోవాలని రైతులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

## పీఠం కోసం పోటాపోటీ

(మొదటి పేజీ తరువాయి)

భిన్నంగా ఉంది. సహకార సంఘం అనేది రైతుల ఆర్థిక నాడి వంటిదని, అటువంటి బాధ్యతాయుతమైన పదవిలో సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ నాయకులను కూర్చోబెడితేనే సంస్థ బలోపేతం అవుతుందని స్థానికులు బలంగా భావిస్తున్నారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన సీనియర్లకు సముచిత స్థానం కల్పించడం వల్ల అటు కార్యకర్తల్లో ఉత్సాహం నింపడమే కాకుండా, ఇటు పరిపాలనాపరంగా కూడా సమర్థవంతంగా ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. పార్టీ కోసం శ్రమించిన వారికి ఈ గుర్తింపు దక్కడం సమంజసమని పలువురు సీనియర్ నాయకులు కూడా ఆశిస్తున్నారు.

**మండల రాజకీయాల్లో కీలక మార్పులు?**

ఈ నామినేటెడ్ పదవి ఎవరిని వరిస్తుందనే దానిపైనే మండల రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉందని రాజకీయ విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు. ఈ నియామకం పూర్తయిన తర్వాత మండల రాజకీయాల్లో కీలక మార్పులు వచ్చే అవకాశం ఉందని, వర్గాల మధ్య సమతూకం పాటించే దిశగానే స్పీకర్ నిర్ణయం ఉంటుందని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. మరి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమర్థతకు, అనుభవానికి పట్టం కడతారా.. లేక యువతకు అవకాశం ఇస్తారా అన్నది తేలాలంటే మరికొద్ది రోజులు వేచి చూడక తప్పదు. ఏది ఏమైనా, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకునే ఈ నిర్ణయం మండల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది అనడంలో ఎలాంటి సందేహం లేదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## ఓఆర్ఆర్‌పై కారు బోల్తా

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద గోల్కొండ ఎగ్జిట్ టోల్‌గేట్ దాటిన అనంతరం ఉదయం సుమారు 6:00 గంటల సమయంలో అమూల్య నడుపుతున్న కారు అదుపుతప్పి రహదారికి కుడివైపున ఉన్న డివైడర్‌ను ఢీకొని, అనంతరం శంషాబాద్ వైపు వెళ్లే రహదారిపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అమూల్యకు తల, చేతులు మరియు శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కారులో పక్క సీటులో కూర్చున్న స్నేహితుడు సిద్ధార్థ్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రైతులకు అప్పు తిప్పలు!

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై ప్రశ్నించిన వారిపై మేనేజర్ సహనం కోల్పోయి దురుసుగా మాట్లాడుతున్నారని తెలిపారు.ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ వివరణ కోరగా.. బ్యాంకులో సిబ్బంది కొరత ఉండటం వల్లే ప్రజలు ఒకేసారి రావడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. గోల్డ్ లోన్ కోసం ప్రతిరోజూ 5 నుండి 15 మంది వరకు ఖాతాదారులు వస్తుంటారని, ఒక్కొక్కరికి 20 నుండి 30 నిమిషాల సమయం పడుతుందని వివరించారు. ముందుగా వచ్చిన వారి పని పూర్తయిన తర్వాతే మరొకరి పని ప్రారంభించాల్సి ఉంటుందని, ఎంతమంది ఖాతాదారులకు చెప్పాలో అర్థం కావడం లేదన్నారు. తానెవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదని స్పష్టం చేస్తూ, ఖాతాదారులు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరికీ బ్యాంక్ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# విభేదాలను పక్కన పెట్టి ఐక్యంగా పనిచేయండి

**మేడ్చల్, జులై 14. ప్రభాతవార్త :** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా కొనసాగిన అంతర్గత విభేదాలు మంగళవారం నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంతో కొలిక్కి వచ్చాయి. కాంగ్రెస్ అధిష్టానం గుండ్లపోచంపల్లికి చెందిన నాయకుడికి కాకుండా గౌడవెల్లికి చెందిన సురేందర్ ముదిరాజ్‌ను డివిజన్ అధ్యక్షుడిగా నియమించడంపై స్థానిక నాయకుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గుండ్లపోచంపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సామూహికంగా రాజీనామా చేయగా, మరోవైపు గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్ మాత్రం అధిష్టానం నిర్ణయాన్ని సమర్థిస్తూ సురేందర్ ముదిరాజ్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించారు. ఈ పరిణామాలే స్థానిక కాంగ్రెస్‌లో తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. ఈ వ్యవహారంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ పాత్రపై బేరి ఈశ్వర్ తీవ్ర ఆరోపణలు చేశారు. షోకాజ్ నోటీసులు ఇచ్చే అధికారం మీకు లేదని, తనపై చర్యలు తసుకుంటే నీ పై కూడా పార్టీ అధిష్టానికి, క్రమశిక్షణ కమిటికి ఫిర్యాదు చేసి నీవో నేనో అక్కడనే తేల్చుకుంటానని ప్రెస్ మీట్‌లో విమర్శలు చేశాడు. అనంతరం ఈశ్వర్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు వజ్రేష్ యాదవ్ ప్రకటించారు, దీంతో "పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేసే అధికారం మీకు లేదు. సస్పెండ్ చేస్తే ఊరుకునేది లేదు. నీ భాగోతం బయటపెడతా. నువ్వు మల్లారెడ్డితో కుమ్మక్కయ్యావు" అంటూ ఆయన మరోమారు బహిరంగంగా విమర్శలు గుప్పించడంతో వివాదం మరింత ముదిరింది. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రంగంలోకి దిగి అసంతృప్త నాయకులతో చర్చలు జరిపి, పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసి పనిచేయాలని కోరడంతో రాజీనామా చేసిన నాయకులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముదిరాజ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని, వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్‌పై వచ్చిన మల్లారెడ్డితో కుమ్మక్కయ్యారు అనే ఆరోపణలను ప్రస్తావిస్తూ నక్క ప్రభాకర్ గౌడ్ స్పందించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఎవరు అమ్ముడుపోరు. ఆయన ఎవ్వరికి రూపాయి ఇచ్చే మనిషి కాదు. పిల్లికి కూడా బిచ్చం వేయడు. కోటి రూపాయలు ఇస్తే ఆ కోటికి ఎన్ని కోట్లు వస్తాయో చూసే వ్యక్తి. కుండలు పెట్టి బిందెలు తీసుకుపోయే వ్యక్తి ఆయన. రాజకీయ నాయకుడు కాదు... వ్యాపారవేత్త. వజ్రేష్ యాదవ్ మల్లారెడ్డితో కుమ్మక్కయ్యాడని చెప్పడం సమంజసం కాదు. ఆ మాటను మనం నమ్మాల్సిన అవసరం లేదు. మేడ్చల్ నియోజకవర్గంలో మల్లారెడ్డి రాజకీయ పని అయిపోయింది. భవిష్యత్తులో ఆయన ఎమ్మెల్యేగా గెలిచే పరిస్థితి లేదు. ఒకవేళ మల్లారెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే నేను గుండు గీయించుకుని తిరుగుతా. నియోజకవర్గాన్ని ఆయన నాశనం చేశాడు. గెలవలేనని తెలిసే ఇతర పార్టీల వైపు చూస్తున్నాడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల మాజీ అధ్యక్షుడు వర్ధారెడ్డి, గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముదిరాజ్, మాజీ జెడ్పీటిసి సాయి పేట శ్రీనివాస్, గుండ్లపోచంపల్లి డివిజన్ ఎస్సి సెల్ అధ్యక్షుడు కుండ భానుచందర్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు కోమలత, నాయకులు రాజేష్, తుంగతుర్తి రవి, కృష్ణ యాదవ్, పానుగంటి మహేష్, భాస్కర్, అనిల్, ఉదయ్ గౌడ్, సురేందర్ రెడ్డి, వెంకట్, కిషన్, షబ్బీర్, సందీప్, ప్రవీణ్, హర్ష, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


రాజీనామా పత్రం అందజేస్తున్న మాజి అధ్యక్షులు వెంకటయ్య గౌడ్

## చైర్మన్ పదివి కోరితే..డైరెక్టర్ ఇచ్చారు

**కుల్కచర్ల,జులై 14, ప్రభాతవార్త:** పిఏసిఎస్ చైర్మన్ పదవి కోరితే.. డైరెక్టర్‌గా ఇచ్చారని మాజి అధ్యక్షులు వెంకటయ్య గౌడ్ అన్నారు. మంగళవారం పిఏసిఎస్ ఇంచార్జి సిఈఓ అలీమ్‌కు స్థానిక నాయకులతో కలిసి రాజీనామా పత్రంఅందజేశారు. ఈ సందర్భంగా మాజి అధ్యక్షులు వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీలో 30 సంవత్సరాలు ఎమ్మెల్యే రామ్మోన్ రెడ్డి కోసం అను క్షణం పనిచేస్తూ అయన గెలుపు కోసం కీలక పాత్ర పోషించానని ఆయనకు పిఏసిఎస్‌లో డైరెక్టర్ పదవి ఇచ్చినందుకు అవమానంగా ఉందని ఎమ్మెల్యే రామ్మోన్ రెడ్డి అనుచరుడిగా ఎటువంటి మచ్చ లేకుండా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా 5 సంవత్సరాలు కొనసాగినాను, ఒక సారి డిసిసి ఉపాధ్యక్షుడిగా పనిచేసినా, ఎమ్మెల్యే రామ్మోన్ రెడ్డి గెలుపు కోసం రాత్రి పగలు కష్టపడ్డా అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసే క్రమంలో రెండు సార్లు రోడ్డు ప్రమాదాలకు గురై ఒక కాలు మరియు చేయి కూడా ఫ్రాక్చర్ అయిందని, ఇటీవల డ్రోన్ ప్రమాదంలో కూడా తన కాలుకి తీవ్ర గాయాలు కూడ అయిందని బాధపడ్డారు. పార్టీ కోసం తన జీవితం అంతా పని చేసినప్పటికి ఒక్క సారి పిఏసిఎస్ ఛైర్మన్ పదవి అడిగితే అంగీకరించి చిన్న చూపుగా డైరెక్టర్ ఇవ్వడం సరికాదన్నారు. తన స్థాయికి డైరెక్టర్ పదవి అవసరం లేదని అవేదన వ్యక్తం చేశారు. తన వయస్సును, పార్టీకి చేసిన సేవలను ఎమ్మెల్యే రామ్మోన్‌రెడ్డి గుర్తించి గౌవరస్థాయి పదవి ఏర్పాటు చేయాలని కోరారు. డైరెక్టర్ పదవి రాజీనామాకు సిద్దపడినట్లు తెలిపారు.

## పోచారం గ్రామ రోడ్డును అభివృద్ధి చేయండి

**బిఆర్ఎస్ డిమాండ్**

**ఘట్‌కేసర్ రూరల్, జులై 14, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ పరిధిలోని జోడిమెట్ల నుండి పోచారం గ్రామం వరకు గల రోడ్డును అభివృద్ధి చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జోడిమెట్ల నుండి పోచారం గ్రామం వరకు గల రోడ్డును స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతూ పలుమార్లు డిసి వాణికి ఫిర్యాదు చేసినా స్పందన లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఏ ఒక్క రోడ్డును అభివృద్ధి చేపట్టడం లేదని అన్నారు. పోచారం వివిధ కాలనీల ప్రజలు ఈ రోడ్డు గుండానే వెళ్తుంటారని గుంతల మయంగా మారిన రోడ్డుతో పాటు భూగర్భడ్రైనేజీ పనులను అసంపూర్తిగా వదలివేశారని అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని లేనిచో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డితో పాటు మాజీ కౌన్సిలర్ చింతల రాజశేఖర్, బి. హరిప్రసాద్‌రావు, నాయకులు సామల బుచ్చిరెడ్డి, అబ్బవతి నర్సింహ, జితేందర్ నాయక్, కేఎం. రెడ్డి, సుందర్ రావు, దేవేందర్, అశోక్, ప్రభాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### అప్పారెడ్డి గూడ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎదిరే సత్య నారాయణ గౌడ్ ఎన్నిక

**నందిగామ, జులై 14, ప్రభాతవార్త:**

నందిగామ మండలం అప్పారెడ్డి గూడ, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఎదిరే సత్యనారాయణ గౌడ్ నియమితులయ్యారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో సత్యనారాయణ గౌడ్ అధ్యక్షులుగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు.



ఈ సందర్భంగా వీర్లపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులుగా కల్వకోలు రాఘవేంద్రగౌడ్, ఈదులపల్లిలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులుగా శ్యామల నర్సింలు, మోత్కులగూడలో అధ్యక్షులుగా జెట్టా రాజు, ఉపాధ్యక్షులుగా జట్ట రామస్వామి లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, అప్పరెడ్డి గూడ సర్పంచ్ మల్లేష్ , ఉపసర్పంచ్ ప్రభు, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, చేగూరు సర్పంచ్ మంకాల శ్రీశైలం, వెంకమ్మ గూడ సర్పంచ్ గోర్లపల్లి అశోక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుల బుచ్చయ్య, కావలి కృష్ణ, సీతారాం, మాణిక్యం, భగవాన్ దాస్, తదితరులు ఉన్నారు.

## ఇంటి నిర్మాణానికి సిమెంట్ పంపిణీ


సిమెంట్ అందజేస్తున్న నాయకులు

**తలకొండపల్లి ,జులై 14, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన ఉప్పలముంతల రాములు ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి ఉచితంగా సిమెంటును అందజేశారు. మంగళవారం నాడు సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ పెరుమాల లలిత జోతయ్య ఆధ్వర్యంలో అతని ఇంటి నిర్మాణానికి అవసరమయిన సిమెంటును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద వారికి ఇంటి నిర్మాణం కోసం ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహాయం చేసే ఆదుకుంటున్నట్లు వారు ఆర్థిక సహాయం చేసే ఆదుకుంటున్నట్లు వారు వివరించారు తెలిపారు. గుడిసెలు లేకుండా ప్రతి ఒక్క పేదవారికి ఇంటినిర్మాణం ఉండాలని ఆర్థికస్తోమత లేని వారిని ఆదుకుంటున్నట్లు వారి సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ లలిత జోతయ్య, ఉప సర్పంచ్ కోటేశ్వర్, జంగారెడ్డి పల్లి సర్పంచ్ మల్లేష్ రవికుమార్ దశరథం నరసింహ విటల్ మధు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని కలిసిన గుజ్జుల మహేష్

**తలకొండపల్లి ,జులై 14, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజును తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్ కలిశారు. మంగళవారం నాడు హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో కలిసి పూలమాలతో అభినందించారు. ఈ సందర్భంగా గుజ్జుల మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని కలవడం నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.


ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని కలిసిన గుజ్జుల మహేష్

### ధారూర్ మండల ఎంపిఒగా శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ

**ధారూర్,జులై 14, ప్రభాత వార్త:** ధారూర్ మండలంలో గత నెల రోజులుగా ఖాళీగా ఉన్న ఎంపీఓ పోస్టు భర్తీకి ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ఖాళీపై ప్రభాత వార్తలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. కుల్కచర్లలో విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌ను డిప్యుటేషన్‌పై ధారూర్ ఎంపీఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షి స్తూ, అన్ని గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని, అధికారుల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని పేర్కొన్నారు.

# శివయ్యా!.. గంగ విడువు పార్వతి చాలు

**వర్షం కోసం శివాలయంలో శివుడికి క్షీరాభిషేకం**
**ప్రత్యేక పూజలు చేసిన ప్రవీణ్ కుమార్ రెడ్డి దంపతులు**

**నందిగామ, జులై 14, ప్రభాతవార్త:**

నందిగామ మండల కేంద్రంలో ఉన్న శ్రీ శివ రామాంజనేయ స్వామి దేవాలయంలో గ్రామానికి చెందిన బోర్ర ప్రవీణ్ కుమార్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి వర్షం కోసం శివుడికి క్షీ రాభిషేకం చేశారు. వాన కాలంలో సైతం ఎండలు మండుతున్నాయని, రైతులు ఎన్నో ఆశలతో విత్తిన మొలకలు ఎండు దశకు చేరుకుంటున్నాయని, భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి, సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని శివయ్య మీరు కరుణించి గంగమ్మతో చెప్పి వర్షాలు కురిపించమని ప్రత్యేక పూజలు చేశారు.


నందిగామ శివాలయంలో వర్షం కోసం పూజలు చేస్తున్న ప్రవీణ్ కుమార్ రెడ్డి దంపతులు.

# నందిగామలో వేగవంతమైన.. ఎంపిడిఒ భవనం నిర్మాణం పనులు


ఫోటో రైట్అప్ 03: త్వరలో ప్రారంభం కానున్న ఎంపిడిఒ కార్యాలయం

**నందిగామ, జులై 14, ప్రభాతవార్త:**

నందిగామ మండల కేంద్రంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో ఎస్డిఎఫ్ నిధులతో అన్ని మోలిక వసతులతో నిర్మిస్తున్న ఎంపిడిఒ కార్యాలయ భవన నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికే 80 శాతం నిర్మాణ పనులు పూర్తికావచ్చాయి. స్థానిక సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, పాలకవర్గం సభ్యులు భవన నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. కాంగ్రెస్ పెద్దలు ఇప్పటికే ముహూర్తం ఖరారు చేసినట్లు త్వరలోనే ఎంపిడిఒ కార్యాలయ అధికారికంగా ప్రారంభోత్సవం చేపట్టబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలిసింది.

# సర్వే నంబర్ 311 రైతులకు త్వరలోనే ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేస్తాం

**తహసీల్దార్ అన్వర్**

**షాబాద్, జులై 14, ప్రభాతవార్త:** సర్వే నంబర్ 311 రైతులకు త్వరలోనే ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేస్తామని తహసీల్దార్ అన్వర్ తెలిపారు. షాబాద్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 311లో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరలో చేపడతామని తెలిపారు. మంగళవారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నంబర్ 311కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం ప్లాట్ల రిజిస్ట్రేషన్ నిర్వహిస్తామని చెప్పారు. రైతుల సందేహాలను ఒక్కొక్కటిగా విని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. షాబాద్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 311కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేస్తున్నారు. ఈ సర్వే నంబర్‌లో భూములు ప్రభుత్వ అవసరాల కోసం తీసుకున్న రైతులకు ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని రైతులు చాలా కాలంగా కోరుతున్నారు. రైతులు తమకు ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అధికారులు రైతుల వివరాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు కూడా తమకు ఇచ్చిన హామీ మేరకు ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అధికారులు తీసుకుంటున్న చర్యలతో సర్వే నంబర్ 311 సమస్య త్వరలో పరిష్కారం అవుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన రైతులకు ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో షాబాద్ సర్పంచ్ అశోక్, కుమ్మరిగూడ సర్పంచ్ శ్రీశైలం యాదవ్, సంకేపల్లి గూడా మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

## వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

**తలకొండపల్లి ,జులై 14, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త గొర్రె మల్లేష్ అనారోగ్యానికి గురికావడంతో అతని వైద్య ఖర్చుల నిమిత్తం బిజెపి మండల యువ నాయకులు ఆరిఫ్ వ్యక్తిగతంగా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. గొర్రె మల్లేష్ గత కొన్ని రోజులుగా బ్రెయిన్ స్ట్రోక్ గురై ఇబ్బందులకు గురవుతున్నాడని, అతనికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో వ్యక్తిగతంగా అతని అవసరం కోసం ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల యువ నాయకులు ఆరిఫ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి శేఖర్ రెడ్డి, జర్నలిస్ట్ యాదగిరి, ఎం శివ, కుద్బుద్దిన్ తదితరులు ఉన్నారు.

### మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు

**తలకొండపల్లి ,జులై 14, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ పెరుమాల లలిత జ్యోతయ్య ను మంగళవారం తెల్లవారుజామున స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచులకు రావలసిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ నిరసన చేపట్టేందుకు వెళ్తారనే సమా చారంతో తలకొండపల్లి మాజీ సర్పంచ్ పెరుమల్ల లలిత భర్త జోతయ్యను అతని ఇంటి నుండి తెల్లవారుజామున తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్లో ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లు ఇవ్వకుండా ప్రభుత్వం మోసానికి గురి చేస్తుం దని, ప్రభుత్వం మారి సంవత్సరంనర దాటినా ఇప్పటివరకు మాకు రావలసిన బిల్లులు ఇవ్వలేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాజీ సర్పంచుల పెండింగ్ వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.


మాజీ సర్పంచ్ భర్తను అరెస్టు చేసిన పోలీసులు

## దేవాలయం వద్ద బోర్ మోటార్ ఏర్పాటు

**తలకొండపల్లి ,జులై 14, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో మంగళవారం నాడు స్థానిక పోచమ్మ గుడి వద్ద నూతనంగా బోర్ వేసి మోటార్ను ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్ లు తెలిపారు. పోచమ్మ గుడి వద్ద భక్తుల సౌకర్యార్థం నీళ్ల లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులకు గురయ్యేవారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతనంగా బోర్ వేసి మోటర్ బిగించి ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్, ఉప సర్పంచ్ అంబటి వెంకటేష్ నాయకులు కొజ్జా రాజశేఖర్ రావిచెడు మహేష్ అంబటి నరసింహ హరికృష్ణ మల్లేష్ శంకర్ అనిల్ మల్లాచారి పద్మ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకే కాన్పులో 4 మేక పిల్లలు జననం

**ఆసక్తిగా తిలకిస్తున్న జనం**

**తలకొండపల్లి ,జులై 14, ప్రభాతవార్త:**

ఒకే కాన్పులో 4 మేక పిల్లలు జన్మించిన ఘటన రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామపంచాయతీ లోని కర్కస్ తండా లోని మంగళవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా సాధారణంగా మేక ఒకటి లేదా రెండు పిల్లలకు జన్మనిస్తుంది. గ్రామానికి చెందిన రైతు మాజీ సర్పంచ్ సభావాట్ శారద శంకర్ నాయక్ దంప తులకు చెందిన అల్లరి ముద్దుగా పెంచుకున్న మేకకు ఒకే కాన్పులో 4 పిల్లలకు జన్మనిచ్చింది. ఫస్ట్ కాన్పులో 2 మేక పిల్లలు, 2 కాన్పులో రెండు మేకపిల్లలు, 3 కాన్పులో2 మేక పిల్లలు, 4 కాన్పులో 4 మగ పిల్లలు పుట్టాయి. పిల్లలన్నీ ఆరోగ్యం ఉండి చెంగుచెంగునా దుంకుతుంటే వీటిని చూడడానికి ఈ వివిధ గ్రామాల నుంచి, తండావాసులు ఆసక్తి కనబరిచారు.



## ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై భగ్గుమన్న బిఆర్ఎస్

**ధారూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

**ధారూర్,జులై 14, ప్రభాత వార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల బిఆర్ఎస్ అధినేత కేసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, పార్టీ ఇతర నాయకులపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలో, సిఎం వ్యాఖ్యలకు నిరసనగా ధారూర్ మండల బిఆర్ఎస్ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. రాజకీయ ప్రత్యర్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు అన్‌పార్లమెంటరీగా ఉన్నాయని, ముఖ్యంగా బిఆర్ఎస్ నాయకుల రక్తాన్ని పంటల మీద చల్లితే అదే పండుతుంది అని ఆయన చేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి, అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన సిఎం ఇటువంటి భాషను ఉపయోగించడం సరైంది కాదని వారు తప్పుబట్టారు. సదరు వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, హఫీజ్, రహిమతుల ఖాన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


పోలీసులకు ఫిర్యాదు పత్రాలు అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఫిర్యాదు

**జిల్లెడు చౌదరిగూడ,జులై 14,(ప్రభాతవార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వాక్యలు చేశారని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం జిల్లెడు చౌదరిగూడ మం డల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ముఖ్యమంత్రి మాట్లాడడం సరికాదని వారు పెర్కొన్నారు. ముఖ్య మంత్రిపై విచారణ జరిపి చట్ట పరమైప చర్యలు చేపట్టాలని వారు పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పడకంటి వెంకటేస్, నర్సింహులు, గుడిసె బాల్‌రాజు, దీమ గణేష్, రామ్‌చరణ్‌లు ఉన్నారు.

**కొడంగల్‌లో..**

**కొడంగల్,జులై 14,ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం, రైతులపై చేసిన వాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు ఎర్రన్‌పల్లి శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం, రైతులపై చేసిన అనుచిత వాఖ్యలను ఖండిస్తూ సీఎం స్థాయి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. రాష్ట్రానికి ప్రతినిధిగా కొనసాగుతు రైతులపై చులకనగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. తక్షణమే సిఎం రేవంత్‌రెడ్డిపై కేసు రనమోదు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తలారి మల్లేష్, గుండ్లకుంట బాల్‌రాజ్, ఏర్పుల మోహన్, మహ్మద్ రఫీ, వెంకట్‌రెడ్డి, భాస్కర్, తలారి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## రేణుకాఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

**శామీర్‌పేట, జులై 14, ప్రభాతవార్త :** శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేయటంతో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తరువాత ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. దీనికి శామీర్‌పేటకు చెందిన నామాల రమేశ్-అరుణ దంపతులు అన్నదానం చేపట్టగా, అదే విధంగా శ్రావణ్-లావణ్య దంపతులు 25కిలోల బియ్యంను అన్నదానం కోసం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఆలయం రాజీవ్‌రహదారికి పక్కనే ఉండటంతో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

### ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**..మండల సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు ఆనంద్ నాయక్**

**పెద్దేముల్, జులై 14, ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని మండల సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షులు ఆనంద్ నాయక్ అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలం కందనెల్లితాండాలో సర్ ప్రక్రియ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆనంద్ నాయక్ మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరు తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ తిరుమలస్వామి, జిపిఓ శివయ్య, ఉపాధిహమి టిఏ విజయ్, పంచాయతీ కార్యదర్శి నవిత, ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### నిర్ణయించిన గడువులోగా సర్ ప్రక్రియను పూర్తిచేయాలి


సర్ ప్రక్రియలో పాల్గొన్న డిపిఓ

**పెద్దేముల్, జులై 14, ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా ఎస్ఐఆర్ ( సర్) ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ అధికారులను ఆదేశించారు. మంగళవారం పెద్దేముల్ మండలంలోని రుక్మాపూర్, కందనెల్లి గ్రామాలను ఆమె సందర్శించి సర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపిఓ జయసుధ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇంటింటి సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించి లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సిబ్బందికి ఆదేశించారు. ఎలాంటి ఫిర్యాదులు ఉన్న సంబంధిత అధికారులకు తెలుపాలని, వాటిని వెంటనే సరిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్, యంపిడిఓ తిరుమలస్వామి, రుక్మాపూర్, కందనెల్లి గ్రామాల సర్పంచ్‌లు సి. బాల్‌రాజ్, యాదమ్మ, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, బిఎల్ఓలు, బిఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

### తాడిపర్తిలో ఓటరు సమగ్ర సవరణ విస్తృత ప్రచారం

**యాచారం,జులై 14, ప్రభాతవార్త :**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమాన్ని తాడిపర్తి సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేస్తూ ఓటర్లను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా ఝాన్సీ రమేష్ మాట్లాడుతూ.. ప్రజలంతా ఓటర్ జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని వారి నమోదును తక్షణమే చేసుకోవాలని కోరారు. నిర్లక్ష్యం చేస్తే రాబోవు ఎన్నికల్లో తమ ఓటును కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని హెచ్చరించారు. ఎన్నికలలో నామినేషన్ వేయాలన్న ప్రాథమిక హక్కులైనా ఓటు హక్కును కోల్పోరాదన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు తప్పవని భవిష్యత్తులో ఓటర్ల జాబితాలో పేరు ఉండకపోవచ్చు అని అన్నారు. ప్రభుత్వం అధికారులు పదేపదే సామాజిక మాధ్యమాల ద్వారా పత్రికల ద్వారా తెలియజేస్తున్నా నిర్లక్ష్యంతో ఉన్నవారికి భవిష్యత్తు ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి నెలకొంటుంది అన్నారు.

### నాయి బ్రాహ్మణ రాష్ట్ర సమన్వయ కమిటీ చైర్మన్గా దశరథ్ నియామకం

**తలకొండపల్లి ,జులై 14, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం మంగళవారంనాడు హైదరాబాదులో నియమించారు. ఈ సమావేశానికి తలకొండపల్లి మండలం నుంచి కానుగుల దశరథం ముఖ్యఅతిథిగా హాజరైనారు. తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవాసంఘం సమన్వయ కమిటీ చైర్మన్ గా కానుగుల దశరథను నియమించారు. కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పాల్గొనే కానుగుల దశరథం నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర సమన్వయ కమిటీ చైర్మన్గా నియామకం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం నియామక పత్రాన్ని రాష్ట్ర కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియామక పత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ చైర్మన్ కానుగుల దశరథంతోపాటు రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### సిపిఎస్ రద్దుతో ఓపిఎస్‌ను కొనసాగించాలి

**ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్**

కొడంగల్,జులై 14,ప్రభాతవార్త:

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించేలా పోరాటం చేస్తామని, కొడంగల్ మండలంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూటీఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ జులై 15న ఉద్యోగ, ఉపాధ్యా యులకు హెల్త్‌కార్డులు ముఖ్యమంత్రి చేతుల మీదుగా జారీ చేస్తారని, త్వరలోనే పీఆర్సీ నివేదికను తెప్పించుకొని పీఆర్సీని అమలు చేస్తారని, ఉద్యోగ, ఉపాధ్యాయుల యొక్క పెండింగ్ బిల్లులను వీలైనంత త్వరగా పూర్తిగా చెల్లిస్తారని ఉద్యోగ, ఉపాధ్యాయులతో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో తెలియజేశారని అన్నారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్‌లతో కూడిన బదిలీలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఉపాధ్యాయులంతా పోరాటానికి సిద్ధమవుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ కార్యకర్తలు విష్ణుకుమార్, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

## హిల్స్ వ్యూ కాలనీ అసోసియేషన్ ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగలేదు

**ఘట్‌కేసర్ రూరల్, జులై 14, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధిలోని ముత్వెల్లిగూడ హిల్స్ వ్యూ కాలనీ సొసైటీ ఎన్నికల ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగలేదని కాలనీవాసులు మంగళవారం నాడొక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన హిల్స్ వ్యూ కాలనీ అసోసియేషన్ ఎన్నికలు అందరికీ ఆమోదయోగ్యం కాదని అన్నారు. కాలనీలోని ప్రతి ఇంటికి సమాచారం ముందస్తుగా ఇచ్చి ఎన్నికలు నిర్వ హించాల్సి ఉండగా కొందరు వ్యక్తులు ఏకపక్షంగా వ్యవహరించి కమిటీ ఏర్పాటుపై స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. కనీసం కోరం లేకుండానే రహస్యంగా ఎన్నికలు నిర్వహించినట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అందరికీ సమాచారం ఇచ్చి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

## నేడు కరంట్ నిలిపివేత

**మేడ్చల్, జులై 14, ప్రభాతవార్త :** విద్యుత్ లైన్లపై పెరిగిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున మేడ్చల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా ఉండదని మేడ్చల్ విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు పట్టణంలోని బాలాజీ నగర్, ఉమా నగర్, వెంకటరామయ్య కాలనీ, చంద్రానగర్, కోర్టు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని తెలిపారు.

ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

